


సలే మా ప్రభాకరం గోరంతలు కొండంతలు చేసికొని బాధపడే రకం. వాడి అదురుకు తోడు డాక్టరుగారి మాటలు గుగ్గిలానికి అగ్గి అంటించినట్లయ్యాయి. "ఏదో ప్రళయానికే వచ్చింది ఈ పుండు" అంటూ హడలిపోయాడు మావాడు. వాడి హడలుతో మాకు వణకువచ్చింది సుమండీ! ఎంత ధైర్యంగా వుందామనుకున్నా డాక్టరుగారి మాటల్లో వుండే అనుమానం మమ్మల్ని క్రుంగదీసింది.

ఇంతకీ అసలుసంగతేమిటంటే నాలుగు రోజులనాడు ప్రభాకరం కాలిబొటనవ్రేలిమీద ఆవగింజంత కురుపు లేచింది. దాన్ని చూడడంతోటే మా వాడు (కొంచెం దూరాలోచనకలవాడు కాబట్టి) మందు వేసి, చీము పట్టుతుందేమో నని పథ్యం చాలాజాగ్రత్తగా తీసికోవటం మొదలెట్టాడు. కాని, ఆ కురుపుకి మావాడి బలహీనం తెలిసినట్లుంది. రెండోరోజుకు చీముపోయటమేమి, పెద్దదవటమేమి, రెండూ కవలపిల్లలు పుట్టినట్లు ఒక్కమాటు జరిగి కూర్చున్నాయి. ఆవగింజంత కురుపు కాస్తా, అనుముగింజంత అయింది. పాపం! చాలా బాధకూడా తయారయింది. అడుగు తీసి అడుగు వేయలేకపోయాడు. వానరసైన్యంలాగు గుంపెడుమంది స్నేహితుల మున్నాంకాబట్టి కాస్త ధైర్యం చెప్పి నడిపించాము. మరి డాక్టరుగారు తెం దుకు మందిచ్చారో లేక... కాని నాలుగో రోజుకి ఆ వేలు బాగా వాచి, చీము దట్టంగా పట్టి కుడుములాగా తయారయింది. గోరుక్రిందకూడా చీమే! బాధకూడా నిష్పత్తిప్రకారం పెరిగినట్టుంది. రాత్రిళ్లు కంటికి కునుకే లేదు.

"ఒరేయ్! ఇది గోరుచుట్టులా గుంది! లేకపోతే యింత బాధపెట్టదు. కాబట్టి నిమ్మకాయ పెడితే తగ్గుతుంది," అన్నాము. వాడి కళ్ళనీళ్ళు తుడిచేందుకు అన్నామే కాని, కాలి బొటనవ్రేలికి, అందులో కుడుమంతయినదానికి పట్టే నిమ్మకాయ దొరకదని మాకుమాత్రం తెలీదూ!

వాడి బాధ చూస్తోంటే మాకు బహు

(31-వ పేజీ చూడండి)

20-12-50



# మావాడి గోరుచుట్టు

(16-వ పేజీ తరువాయి)

కష్టమేసింది. సోమయాజులు కొంచెం తపా కాలంవాడు కాబట్టి "ఒరే యిది గోరుచుట్టూ కాదు వల్లకాడూ కాదు. మొన్న సింహాచలం వెళ్లినరోజు కొండ ఎక్కలేక నువ్వు దేముణ్ణి తిట్టివుంటావు. అపరాధ కానుక యిచ్చి దంపతులంగా కొండకు వస్తాం స్వామీ అని మొక్కుకో" అన్నాడు. అంతా గొల్లుమన్నారు. "అబ్బ మహేంద్రమణి వుంటే ఇట్టే తాకిస్తే అట్టే పోతుందిగదా?" అన్నాడు మూర్తి. "నువ్వు చదవటం రాల్లేనేగా ఈమాటు జాగ్రత్తగా తెలుసు" అన్నాడు రామం (మూర్తిది జియాలజీ గ్రూపులెండి).

ఇక మావాడు ఈ వేళాకోళాలన్నీ వినలేక "అబ్బాయ్! పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణసంకటం. నాలుగురోజులనాడు ఆవగింజంత వున్నది, రెండోరోజుకి అనుముగింజంతయి, ఈ రోజుకి కుడుమంతయిందే! ఇంక నాలుగోరోజుకి ఆనపకాయంతవుతుందేమో" అన్నాడు. "ఏమీ కాదులేరా అది గోరుచుట్టేను. నేడో రేపో చిట్లుతుంది" అన్నాను నేను. నిజమే డాక్టరు చేతే చీము తీయిచ్చేస్తే బాధ తగ్గుతుంది అన్నారు అంతా.

ఇంతా అక్కడకు వెడితే ఆయన శూలాల్లాంటి మాటలు చెవిని పడేశాడు- "నాయనా! ఇన్నాళ్ళు ఊరుకున్నాను. ఇక చెప్పక తప్పదు. ఇది అంత సులభమయినపని కాదు. ఇది ఒకవిధమైన అపాయపు కురుపు. దీనిని బహుజాగ్రత్తగా ఆపరేట్ చేయాలి. ముప్పైరూపాయలు ఫీజు" అన్నాడు. మావాడికి నోట మాట రాలేదు. మా కంతా గుండె గుభేలుమంది.

"మాశారా! మీ కంతనవ్వులు గా ఉండింది. కొంపమీది కొచ్చింది. అపాయకరమట! ఏడీ ఆ సీతారాముడు? నేడో రేపో చిట్లుతుంది, ఎంచుకుంటూ కూర్చొమన్నాడు. వాడో తెలివితక్కువ దద్దమ్మ. పైగా ఆర్ట్సువాడు. వాడిని నమ్ముకుని కూచుంటే ఏం జరిగేదో! ఏమైనాసరే ఇంక ఒక్క క్షణం ఇక్కడ వుండను. మావూరు వెళ్తాను" అన్నాడు.

సరే మేముమాత్రం ఏమంటాం? పాపం వాడసలే అమాయకుడు. "నాన్నను స్టేషనుకు రమ్మని వైరివ్వండి" అన్నాడు. వాళ్లు నీకంటే గాభరాపడతారు. నీవు రైలెక్కినతర్వాత యిస్తాంలేరా అన్నాం. ఫోనుచేస్తే రైలు రెండుగంటలు లేటన్నారు.

ఈలోపల రామంగాడి ప్లాస్కులో కాఫీ, మూర్తిగారి చెంబులో మంచినీళ్లు, కురుంబవిలాస్‌నుంచి గారెలు, రావుగారి దగ్గర పాతపత్రికలు, నవలలు, కొంచెం వక్కపొడీ తెచ్చాం ప్రయాణానికి. ఓ దిండుమాత్రం కాలుపెట్టుకుందుకి ఇవతల వుంచి పక్క కట్టాం. ఇంటర్లో వెళ్లరా అంటే "ఆ యింటర్లో కూడా జనం వుంటారు, సెకండుక్లాసులోనే వెళ్తా"నన్నాడు. ఆశ్చర్యమేమిటంటే డాక్టరుగారి మాటలు విన్నప్పటినుంచీ వాడికి బాధ ఎక్కువయి, కాలు కదల్చలేకపోయాడు. బాబు బండితెచ్చేందుకి వెళ్ళాడు. ఇంతలో రావు వస్తూ మాడకుండా (హడావుడిలో ప్రభాకరానికి తీసిపోడు లెండి) వాడి కాలు తన్నాడు. ఇంకేముంది అది కాస్తా పగిలి చీమూ రక్తం వచ్చేశాయి. "ఫరవాలేదురా గండం గడిచి గట్టెక్కాను" అన్నాడు మావాడు. "చాల్లే నీ మొహం గండమట గండం, గోరుచుట్టురా చిట్లుతుంది అంటే, ఆర్ట్సువాడు; కూసూ గుడ్డూ అని ఏమేమో అన్నావట. ఇప్పుడేమయింది" అంటూ ఓ అడుగు ముందుకేశాను. మేంమాత్రం చెప్పలా గోరుచుట్టు అని అంతా ముందుకు వచ్చారు. "ఏం లేదు. నా మనసులోనే మొక్కుకొన్నాను సింహాచలేశ్వరుడికి. అందువల్లే ఇలా జరిగింది." అంటూ తిరిగి గంతేశాడు సోమయాజులు. వచ్చిన బండివాడికి పావులా యిచ్చిపంపాం. అటు డాక్టరు నోట్లో, యిటు రైలువాడి నోట్లో కరక్కాయ పడింది. కానీ మామాటే నిజమయినందుకు మా నోరు మాత్రం తీపుచేస్తాడులెండి పెళ్ళిలోనయినా.

ఇప్పటికీ ఎవరేనా హడావిడి చేస్తే "ఏమిట్రా ప్రభాకరం గోరుచుట్టులాగ చేస్తున్నావు" అంటాము మేము.

---

# సినిమా

(26-వ పేజీ తరువాయి)

పాత్రకూడా ఉండటంవలన, హేమపాత్రను సృష్టించుకున్నారు. కానీ ఆమెకు తగిన స్థానాన్ని సృష్టించలేకపోయారు. యీ పాత్రను తమ కథా వస్తువుకు తగినట్లు మార్పు చేసుకోవటంలో తట్టుకోలేక పోషించలేకపోయారు. చంద్రసేనుడు హేమపాత్రల మధ్య సంబంధం అర్థంగాదు. పసువును కొంటే పలుపుకూడా వచ్చినట్లు చంద్రసేనునకు లీలతోపాటు, హేమను కూడా కట్టబెట్టారు. అంతకుమించిన సంబంధం వారిరువురి మధ్యను ఉన్నట్లు తెరమీద ఏమీ కనబడలేదు. ఇలా పాత్రపోషణవిషయంలో సినేరియో రచయిత, మాటలు, పాటలు వ్రాసే కవి, ఎడిటరు, దర్శకుడు, శిల్పి మొదలైనవారిపై ఆధారపడి ఉంటుంది. ఆర్టు డైరెక్టరు కూడా యీ విషయంలో ఎంతో సహాయసంపత్తి కల్పిస్తాడు. కానీ అతని శిల్పంద్వారా పాత్రల శీలం వ్యక్తంచేసి పోషించాలంటే, వాటికి తగిన 'క్లోజప్' యిస్తేగాని ప్రేక్షకునికి చూపి సూటిగా వ్యక్తం చేయలేడు. కనుక తిరిగి మొదటి మెట్టు అయిన సినేరియో రచయిత చెయ్యి పడవలసిందే!

కనుక వీరందరూ ఒకేవిధమైన ధర్మాన్ని వహించి, ఒకే దృక్పథంలో చూచి ఏకీభవిస్తే తక్క పాత్రపోషణ సర్వసమర్థనీయంగా ఉండదు. వీరందరి సమిష్టి సహకారంచేతగాని వారు చూపదలచుకున్న పాత్రలను సరిగా పోషించి వాస్తవికతను కల్పించి సూటిగా ఉన్నవి ఉన్నట్లుగా చిత్రించలేరు.

